క్లుప్తంగా

నిధులు మంజూరుపై హర్షం


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో యాదవ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని యాదవ సంఘం సభ్యులు కోరారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని జిల్లాకేంద్రంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించి తన నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయడంపై సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేశ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబలి పంపిణీ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాంచందర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద పాకాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ రాంచందర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత అంబలి జూన్ 2 వరకు అందిస్తామన్నారు. గత 7 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, నాయకులు ఆమెడ శ్రీధర్, కొట్టే శేఖర్, ఎంసీ లింగన్న, యాటకారి సాయన్న, అనుముల భాస్కర్, అకోజీ కిషన్, ముడుసు సత్యనారాయణ, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఈద్ మిలాప్


మాట్లాడుతున్న ఎంఈవో నరేందర్

తానూరు: పండుగలను సంప్రదాయబద్ధంగా అందరూ కలిసిమెలిసి జరుపుకుంటున్నామని ఎంఈవో నరేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో ప్రతీ పండగలను కలిసిమెలిసి జరుపుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం మిర్ అజ్గర్‌అలీ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మల్లన్న, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సాయిబాబు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తుడుందెబ్బ మహాసభలు విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ వద్ద ఈనెల 12,13,14వ తేదీల్లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ మహాసభలకు తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, తుడుం దెబ్బ నాయకులు మనోజ్, వరుణ్, ఆత్రం గణపతి, తదితరులు ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన


పాల్గొన్న మహిళలు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆలయ ఆవరణలో కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ నుంచి మస్కాపూర్ వెళ్లే మార్గంలోని 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కారణంగా మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. పద్మావతినగర్‌తోపాటు బస్టాండ్ ఏరియా, ఇంద్రానగర్ తదితర మార్గాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆకాశంలో మబ్బులు.. రైతుల్లో గుబులు


రాచాపూర్ సమీపంలో కోతకు వచ్చిన వరి

- పంట చేతికందే సమయంలో వర్షాలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- వరుణ దేవుడు కరుణ చూపాలని వేడుకోలు

లక్ష్మణచాంద: ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులతో జిల్లాలో మూడు రోజులుగా పలుచోట్ల అకాల వర్షాలు కురిశాయి. ఆరుగాలం శ్రమించి రైతులు పంటలు సాగు చేశారు. పంటలు చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలకు దిగులు చెందుతున్నారు. మండలంలోని గ్రామాల్లో యాసంగిలో సాగు చేసిన వరిపంట చేతికందనుంది. మరో వారంలో కోతలు షురూ కానున్నాయి. ఇప్పటికే హార్వెస్టర్లతో కోత కోయడానికి వీలుగా పంటను ఆరబెడుతున్నారు. వాతావరణ మార్పులు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఆందోళన చెందుతున్నారు. పంట కోత కోసే సమయంలో వరుణ దేవుడు కరుణచూపాలని వేడుకుంటున్నారు.

9 వేల ఎకరాల్లో సాగు

మండలంలోని 18 పంచాయతీలు 23 గ్రామాల పరిధిలో యాసంగిలో 9 వేల ఎకరాల్లో వరి సాగైంది. చామన్‌పెల్లి తదితర గ్రామాల్లో రెండు, మూడు రోజుల్లోనే వరి కోతలు ప్రారంభించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇంతలో అకాల వర్షాలు కురుస్తుండటంతో వరి కోయలా వద్దా అనే సందేహంలో ఉన్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిస్తే పంట పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నేలకొరిగితే హార్వెస్టర్లతో కోయడం కష్టంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

భయంగా ఉంది



యాసంగిలో సాగు చేసిన వరి పంట కోతకు వచ్చింది. వారంలో కోత కోసందుకు సిద్ధమవుతున్నా. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వర్షం కురవడంతో భయంగా ఉంది.

– ప్రభుదాస్, రైతు, పొట్టపెల్లి

ఆందోళనలో ఉన్నాం



మూడు రోజులుగా సాయంత్రం వేళ ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. వర్షం పడుతుందోననే ఆందోళనలో ఆకాశం వైపు చూస్తున్నాం. పంట కోయాలో వద్దో తెలియడం లేదు.

–సాయన్న, రైతు, పొట్టపెల్లి

దుబాయ్‌లో ఘనంగా శ్రీరామనవమి


వేడుకల్లో పాల్గొన్న ప్రజలు


పట్టాభిషేకం చేస్తున్న వేదపండితులు, వీడీసీ సభ్యులు

ఖానాపూర్: దుబాయ్‌లోని అజ్‌మాన్ ప్రాంతంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఖానాపూర్ వాసి రాపెల్లి వెంకటేశ్, జిల్లా వాసులు ఎస్.నర్సయ్య, రాకేశ్‌గౌడ్, పి.మహేందర్ ఉన్నారు.

శ్రీరాముడి పట్టాభిషేకం..

సారంగపూర్: మండలంలోని జామ్, స్వర్ణ గ్రామాల్లోని పట్టాభి, కోదండరామ ఆలయాల్లో పట్టాభిషేకం ఘట్టాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాముడి ఉత్సవ విగ్రహాన్ని ఆరుబయట మండపంలో ప్రత్యేకంగా తయారు చేయించిన సింహాసనంలో ఉంచి పట్టాభిశిక్తుడిని గావించారు. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వీడీసీ సభ్యులు, వేదపండితులు రామకృష్ణాచార్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్ యాదవ్

భైంసాటౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల కార్యకలాపాలు, విధులు, ఇతర అంశాలపై విద్యార్థులు అవగాహన ఉండాలని ఆర్డీవో సీహెచ్ కోమల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బాలశక్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్డీవో, తపాలా శాఖ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో అధికారులు విద్యార్థినులకు పలు అంశాలపై వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణమంజుల, ఉపాధ్యాయులు ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం

- వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డి


పంపిణీ చేస్తున్న సోమా భీమ్‌రెడ్డి, నాయకులు

నిర్మల్‌రూరల్: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రాత్మకమని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డి అన్నారు. నిర్మల్‌రూరల్ మండలం నీలాయిపేటలో సోమవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనవంతులు తినే సన్నబియ్యం ఇకపై పేదలు తినే రోజులు వచ్చాయని అన్నారు. ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ పథకాన్ని పేద,మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షులు వేణుగోపాల్, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, పద్మాకర్, విలాస్, మాజీ సర్పంచ్ సాయన్న ఉన్నారు.

నర్సాపూర్(జి): నందన్, తురాటి గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ప్రారంభించారు. డీలర్లు జాదవ్ చంద్రకాంత్, రాజేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: రాజూర గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని తాజామాజీ సర్పంచ్ ముత్తగౌడ్ అందజేశారు. నాయకులు పోతన్న, సాయిప్రసాద్, అనిల్, నల్ల రమేశ్, భోజన్న ఉన్నారు.

కుంటాల: సూర్యాపూర్‌లో సోమవారం లబ్ధిదారులకు సన్నబియ్యం నాయకులు పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ శీల సాయినాథ్, కాంగ్రెస్ యూత్ మండల కన్వీనర్ మహేశ్‌యాదవ్, రొడ్డ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి


వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

కడెం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని కేంద్ర ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ సలహా కమిటీ సభ్యుడు బుర్ర రమేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని మాసాయిపేట్‌లో బీజేపీ బూత్ అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో పార్టీ జెండాను ఆవిర్భావ వేడుకల కమిటీ చైర్మన్ అడ్వాల రమేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ జన్మభూమి కోసం అయోధ్యకు వెళ్లిన కర సేవకులను సన్మానించారు. మండల అధ్యక్షుడు చిన్నయ్య, ఆవిర్భావ వేడుకల కమిటీ కోచైర్మన్ జీవన్‌రెడ్డి, నాయకులు చంద్రమోహన్ రెడ్డి, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, అనిల్ ఉన్నారు.

నిజాయతీ చాటిన కండక్టర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కండక్టర్ ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును తిరిగిచ్చి నిజాయతీ చాటుకున్నాడు. నిర్మల్ నుంచి భైంసా వెళ్లే బస్సులో సోమవారం శివకుమార్ అనే ప్రయాణికుడు సీటు పై పర్సు మరిచి భైంసాలో దిగి వెళ్లిపోయాడు. గమనించిన కండక్టర్ పర్సులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా ఫోన్ చేసి, నిర్మల్ బస్టాండ్‌లో పర్సును అప్పగించాడు. అందులో రూ.1200 నగదు, ఏటీఎం కార్డు ఉంది. ఈ సందర్భంగా కండక్టర్ గంగాధర్‌ను డిపో మేనేజర్ కే.పండరి అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కుంటాల: కుంటాలలోని ప్యాదరి సాయన్నకు రూ.60 వేలు, చిన్న పారెడ శంకర్‌కు రూ.25,500, సుదం చంద్రక్కకు రూ.24వేలు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. వీటికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం ఆయన నివాసంలో పంపిణీ చేశారు. నాయకులు వెంగళరావు, నవీన్, లింగురాం పటేల్, చిన్నన్‌రావు ఉన్నారు.

హనుమాన్ స్వాములకు భిక్ష

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో సోమవారం మండలానికి చెందిన హనుమాన్ దీక్ష పరులకు భిక్ష ఏర్పాటు చేశారు. నిర్వాహకులు శ్రీనివాస్, కృష్ణవేణి లక్ష్మినర్సయ్య, వెంకట్ మహేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకముందు గురుస్వామి గంగాధర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

ఇష్టారాజ్యంగా సీసీ రోడ్ల పనులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెతోపాటు ప లు గ్రామాల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సీసీ రోడ్ల పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్‌ఆర్ ఉపాలి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఉపాలి మాట్లాడారు. పలుచోట్ల పంచాయతీలకు సంబంధించిన రోడ్లు లేనప్పటికీ లీడర్లు వారి ఇంటి చుట్టూ రోడ్లు వేసుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఆస్తిపన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: ఈనెల 30లోగా 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి పన్నుపై ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు స్థానిక ఏరియా బిల్ కలెక్టర్‌కు ఆస్తి పన్ను చెల్లించి రసీదు పొందాలని సూచించారు. ఇతర వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

సోన్: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏవో వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఫర్టిలైజర్ డీలర్లతో సోన్ రైతు వేదికలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ఫర్టిలైజర్స్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్, గోసంపల్లె గ్రామాల్లో ఖానాపూర్ మండల ప్రత్యేకాధికారి, సీపీవో జీవరత్నం సోమవారం పర్యటించారు. పంచాయతీల రికార్డులను తనిఖీ చేయడంతోపాటు గ్రామాల్లోని పారిశుద్ధ, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయా చోట్ల సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

కుంటాల: విఠాపూర్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీవో ఎంఏ రహీంఖాన్ సోమవారం పరిశీలించారు. ప్రతి కూలీకి జాబ్ కార్డు జారీ చేసి 100 రోజుల పని కల్పించాలని ఆదేశించారు. ఏపీవో నవీన్, టీఏ మాధురి, ఎఫ్ఏ సుదర్శన్, తదితరులు ఉన్నారు.

తానూరు: దౌలతాబాద్, ఖర్బాలా, జౌలా(బి) గ్రామాల్లో ఈజీఎస్ ఏపీవో శివలింగం సోమవారం ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ఉదయం పనులకు త్వరగా వచ్చి ఎండకు ముందే ముగించి ఇంటికి వెళ్లాలన్నారు. ఉపాధి కూలీ రేట్లు పెరిగాయన్నారు. టీఏ గంగాధర్, ఎఫ్ఏలు ఉన్నారు.

అనాథ పిల్లలకు గురుకుల సీట్లు

కడెం: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు అనాథ పిల్లలు గురుకుల సీట్లు సాధించారు. మండల కేంద్రానికి చెందిన బాసగుట్ట రాజు భార్య నాలుగేళ్ల క్రితం మరణించగా, రాజు ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వీరి పిల్లలు మేఘన, సాత్విక్ అనాథలయ్యారు. వారిని కుటుంబ సభ్యులు అక్కున చేర్చుకోగా, మండల కేంద్రంలోని రాఘవేంద్ర పాఠశాల యాజమాన్యం మానవత దృక్పథంతో ఇద్దరికి ఉచిత విద్య, కోచింగ్ అందించడంతో నిర్మల్ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారు. సోమవారం ఉపాధ్యాయులు వారిని అభినందించారు.


ఉపాధ్యాయులతో మేఘన, సాత్విక్

రాజ్యాంగ పరిరక్షణ కోసమే పాదయాత్ర


భైంసారూరల్: పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు


ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- జై బాపు జైభీమ్ జై సంవిధాన్ జిల్లా ఇన్‌చార్జి రామ్‌భూపాల్

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యవహరిస్తోందని జై బాపు జైభీమ్ జై సంవిధాన్ జిల్లా ఇన్‌చార్జి రామ్‌భూపాల్ అన్నారు. పట్టణంలోని పిప్రి కాలనీలో సోమవారం కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జైబాపు జైభీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, మహాత్మాగాంధీ, అంబేద్కర్ గొప్పతనం వివరించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం నాయకులు, కార్యకర్తలతో ప్రమాణం చేయించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు బి.నారాయణ్‌రావు పటేల్, జి.విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్‌తో కలిసి లబ్ధిదారు ఇంట్లో సన్న బియ్యం వంట రుచి చూశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగపూర్: రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు బీజేపీ తెరలేపిందని దాన్ని ప్రజలకు చెప్పేందుకు గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. బోరిగాం, ధని, సాయినగర్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రాజ్యాంగాన్ని, అది రచించిన అంబేద్కర్ గొప్పతనం గురించి వివరించారు. బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, ఆలూరు పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ శంకర్‌రెడ్డి, డైరెక్టర్లు పోతారెడ్డి, అహ్మద్ ముక్త్యార్ ఉన్నారు.

భైంసారూరల్: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టారు. మాంజ్రి గ్రామంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, నాయకులు అహ్మద్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తానూరు: బెంబర, బోల్సా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు రాజన్న పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేకుట్ర చేస్తోందన్నారు. నాయకులు పుండలిక్, చంద్రకాంత్ యాదవ్, గోవింద్‌రావ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): బామ్ని(బి), నందన్ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి ప్రజలకు రాజ్యాంగం వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. నిర్మల్ ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, కొంద్ర రమేశ్, గోవింద్‌రెడ్డి, ఉమామహేశ్వర్, దేవేందర్, నారాయణ, రవి, సాయినాథ్ పాల్గొన్నారు.

సోన్: లోకల్ వెల్మల్, గాంధీనగర్ గ్రామాల్లో జై బాపు జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ రక్షణ మన అందరి బాధ్యత అన్నారు. మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, బొడ్డు లక్ష్మణ్, అంబేకర్ ప్రసాద్, మేక ప్రేమ్‌కుమార్, లింగన్న పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పొట్టపెల్లి(కే), కనకాపూర్ తదితర గ్రామాల్లో గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఓస రాజేశ్వర్, నాయకులు రాజేందర్ యాదవ్, ప్రతాప్‌రెడ్డి, బిట్లింగ్ రజినీకాంత్, అజార్, భూమన్న, గంగాధర్‌గౌడ్, సిరాజ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి

- డీఆర్వో నజీర్‌ఖాన్


జామ్‌లో మాట్లాడుతున్న డీఆర్వో నజీర్‌ఖాన్

సారంగపూర్: అటవీ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్ సూచించారు. మండలంలోని జామ్‌లోని పీఎంశ్రీ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో నిపుణుల సలహా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అటవీ, పర్యావరణం, అటవీ సంరక్షణ, అటవీ జంతువుల పరిరక్షణ అనే అంశాలపై డీఆర్వో సోమవారం అవగామన కల్పించారు. అడవులను రక్షించుకోవాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఇళ్ల ఆవరణలోనూ వీలైనన్ని మొక్కలు నాటి పెంచాలని తెలిపారు. ఇలా చేస్తే అడవుల నరికివేతలో కొంతైనా పూరించగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు భూమేశ్, స్రవంతి, స్వప్న, వెన్నెల, సుజాత, ప్రిన్సిపాల్ సంగీత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన పార్కింగ్



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో సిబ్బంది, పేషంట్ బంధువులు ఇష్టానుసారంగా తమ వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. సోమవారం ఒక గర్భిణి అంబులెన్స్‌లో వచ్చింది. ఆమె దింపేసిన తర్వాత అంబులెన్స్ తిరిగి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా రోడ్డుకు అడ్డంగా కారు పార్కింగ్ చేశారు. దీంతో అరగంటపాటు అంబులెన్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉంది.

ఒక్క చెట్టు.. యాభై వాహనాలకు రక్ష!



కుంటాల: చెట్టు లేనిదే మానవాళికి మనుగడ లేదు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తుంటారు. ఇందులో భాగంగా కుంటాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేప మొక్కలు నాటారు. మహా వృక్షమై తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం బైక్‌లపై వస్తుంటారు. వేసవికాలం దృష్ట్యా ఒకే చెట్టు యాభై బైక్‌లకు నీడనిస్తోంది.

పరామర్శ

నిర్మల్‌చైన్‌గేట్: మామడ మండలం నల్దుర్తికి చెందిన కాంగ్రెస్ నాయకుడు భీమేశ్ అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సోమవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అబ్దుల్ హాది, రవికుమార్ ఉన్నారు.